

వైకుంఠధామంలో తలదాచుకుంటున్న సంతోష్ కుటుంబ సభ్యులు

మంట కలిసిన మానవత్వం

- అద్దె ఇంట్లో చనిపోయిన పెద్దాయన
- ఇంట్లో ఉండటానికి ససేమిరా అన్న యజమాని
- వైకుంఠధామంలో తలదాచుకుంటున్న కుటుంబం

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మానవత్వం మంటగలిసిన ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సిద్దిపేటలో నివాసముంటున్న సంతోష్ అనే వ్యక్తి తండ్రి చనిపోవడంతో శవాన్ని ఇంటిముందు పెట్టేందుకు, ఆ తర్వాత ఆ ఇంట్లో వారు ఉండేందుకు ఇంటి యజమానికి ససేమిరా అనడంతో ఆ కుటుంబం కొన్ని రోజులుగా వైకుంఠధామంలో తలదాచుకుంటోంది. కామారెడ్డి జిల్లా మన్సూర్‌కు చెందిన సంతోష్ బతుకుదెరువు కోసం కుటుంబంతో సహా సిద్దిపేటకు మూడు నెలల క్రితం వచ్చి శంకర్ నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. తల్లిదండ్రులతో పాటు ఇద్దరు పిల్లలు, భార్యతో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ ఇంటి పెద్ద సంతోష్ తండ్రి దత్తయ్య(75) అనారోగ్యంతో ఈనెల 11న సాయంత్రం కన్నుమూశారు. ఇదే విషయాన్ని ఇంటి ఓనరుకు సమాచారమిచ్చారు సంతోష్ కుటుంబ సభ్యులు. అయితే, ఇంటి యజమానికి తన ఇంటి ముందు చావు కార్యక్రమం పెట్టొద్దని మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకెళ్లాలని సూచించారు. సొంతూళ్లో సరైన వసతులు లేకపోవడంతో ఎలాగో సర్దిచెప్పవచ్చని ఇంటిముందు టెంట్ వేసి కార్యక్రమం మొదలు పెట్టారు. విషయం తెలిసిన సదరు ఇంటి యజమాని అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు. టెంట్ తీసేయాలని చిర్రుబుర్రులాడాడు. చుట్టుపక్కల వాళ్ల సర్దిచెప్పటంతో అంత్యక్రియలు అయ్యేవరకు ఆగాడు. అయితే, ఆ తర్వాత తన ఇంట్లో ఉండవద్దని కరాఖండిగా చెప్పేశాడు. దశదినకర్మ అయ్యే వరకు ఇంట్లోకి రావద్దన్నాడు. తమకు



సొంతూళ్లో సరైన వసతులు లేవని ఇంటిల్లిపాది వేడుకున్నా కూడా యజమాని మనసు కరగలేదు. ఎంతమంది చెప్పినా కూడా వినే ప్రసక్తే లేదని తేల్చి చెప్పటంతో గత్యంతరం లేక ఈనెల 12 నుంచి పట్టణంలోని శ్రీరామకుంట శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు తలదాచుకుంటున్నారు. వైకుంఠధామంలోని ఓ షెల్టర్‌లో ఇద్దరు చిన్నపిల్లలు, వయసు పైబడిన తల్లి, తన భార్యతో సంతోష్ ఉంటున్నాడు. వారి దీనస్థితిని చూసి పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

పన్ను పోటు!

ప్రధాన ఆదాయ వనరులైన పన్నులను పెంచుకునేందుకు సిద్దిపేట మున్సిపల్ నడుం బిగించింది. అందుకు ముందుగా సిద్దిపేటలోని నీటి కుళాయిలతో పాటు పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ)పై కూడా కౌన్సిల్ ఆమోదంతో మున్సిపల్ అధికారులు పన్ను వేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇక యూజీడీ కనెక్షన్ కావాలంటే నివాస గృహాలు, వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు, రెస్టారెంట్లు ఇలా పలు విభాగాలుగా విభజించి పన్ను వసూలు చేసేందుకు సిద్దిపేట మున్సిపల్ గెజిట్‌ను విడుదల చేసింది. పెరిగిన కొత్త పన్ను బిల్లుల ప్రకారం గతేడాది నవంబర్ నుంచి అమలులోకి వచ్చేలా గెజిట్‌లో పేర్కొన్నారు. దాంతో పాటు నీటి కుళాయికి సంబంధించి కూడా అదే తరహాలో పలు విభాగాల వారీగా బిల్లులను నిర్ణయించింది.

- సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 16



అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అనుసంధానం చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- సిద్దిపేట మున్సిపల్ పరిధిలో నీటికుళాయి పన్ను రూ. 150 నుంచి రూ. 200కు పెంపు
- యూజీడీ కనెక్షన్ కావాలంటే బిల్లు చెల్లించాల్సిందే
- నెలవారీగా రూ.100 పన్ను వసూలుకు గెజిట్ విడుదల
- ఆదాయ వనరుల కోసం మున్సిపల్ ముందడుగు

సిద్దిపేట జిల్లా కేంద్రంగా మారడంతో పాటు పట్టణ విస్తీర్ణం పెరగడంతో చాలామంది భూ యజమానులు ఇళ్లు నిర్మించుకున్నారు. పట్టణంలో ఇప్పటివరకు 36,138 ఇళ్లు నిర్మించుకోగా, మరికొన్ని నిర్మాణదశలో ఉన్నాయి. పట్టణంలో ఉన్న భవనాలు, ఇళ్లు, దుకాణ సముదాయాల నుంచి మున్సిపల్‌కు గతంలో ప్రతి ఏడాది రూ.15,71,98,580 ఆస్తి, నీటి కుళాయి పన్ను రూపేణ ఆదాయం వచ్చేది. ఇటీవల అధికారులు ఆదాయం పెంచుకునేందుకు 200కు పైగా భవనాల ఆస్తిపన్ను సవరించడంతో రూ. 17,53,14,000కు పెరిగింది. ఆస్తి పన్ను కొంతమేర పెరగడంతో ఆస్తిపన్ను కాకుండా ప్రస్తుతం నీటికుళాయిపై దృష్టి సారించారు. నీటికుళాయికి సంబంధించి 36,138 నివాస గృహాలుండగా వీటిలో 35,788 నివాసాలు మాత్రమే నీటి కనెక్షన్ కలిగిఉన్నారు. 35,788 నివాసాలకు గానూ రూ. 150 వసూలు చేస్తుండగా ఇప్పుడు దానిని రూ. 200కు పెంచింది. ప్రతిరోజూ పట్టణంలో 25.25 మిలియన్ లీటర్ పర్ డే (ఎంఎల్‌డీ) తాగునీరు సరఫరా చేస్తున్నారు.

యూజీడీ కనెక్షన్‌కు బిల్లు తప్పనిసరి

అమృత్ పథకంలో భాగంగా మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంకల్పించి సిద్దిపేటలో రూ. 270 కోట్లతో 325



సిద్దిపేట పట్టణంలో మున్సిపల్ నీటి కుళాయిల ద్వారా అందిస్తున్న తాగునీరు (ఫైల్)

కిలోమీటర్ల మేర మురుగు నీరు కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. దీంతో యూజీడి పని జరుగుతున్న

మిగతా 8లో..

నీటి కుళాయిలకు సంబంధించిన ఫీజులు

క్రస	విభాగం	ఫీజు
1.	నివాస గృహాలు	రూ. 150 నుంచి రూ.200కు
2.	బహుళ అంతస్తుల భవనాలు 20 ప్లాట్ల లోపు ఉన్నవారికి,	డొనేషన్ చార్జీలు రూ. 50వేలు, నెలకు రూ. 2 వేలు
3.	వాణిజ్య సముదాయాలు 1000 చ.మీటర్లు లోపు (15డయాఎంఎం)	డొనేషన్ చార్జీలు రూ. 15 వేలు, నెలకు రూ. 850
4.	వాణిజ్య సముదాయాలు1000 చ.మీటర్లు లోపు, పైగా ఉన్నవారికి (15డయాఎంఎం)	డొనేషన్ చార్జీలురూ. 15వేలు, నెలకు రూ. 1000
5.	వాణిజ్య సముదాయాలు 1000 చ.మీటర్లు పైగా ఉన్నవారికి (25డయాఎంఎం)	డొనేషన్ చార్జీలు రూ.50 వేలు,
6.	ఇండస్ట్రీస్, కళాశాలలు	నెలకురూ.1200 నుంచి రూ.1,800 డొనేషన్ చార్జీలు రూ. 2 లక్షలు, నెలకు రూ. 1,800

నూతన యూజీడీ కనెక్షన్ ఫీజులు

క్రస	విభాగం	ఫీజు
1.	నివాస గృహాలు	రూ. 5వేలు
2	బహుళ అంతస్తులు	రూ. 5 వేలు
3	ఆసుపత్రులు, రెస్టారెంట్లు, స్వీట్‌హౌజ్ ప్రైవేట్ హాస్టళ్లు, షాపింగ్‌మాల్, ప్రైవేట్ విద్యా సంస్థలు, స్విమ్మింగ్‌పూల్, సినిమా హాళ్లు, పరిశ్రమలు, పెట్రోల్ పంపులు, ఫ్యాక్టరీలు, ఇతరాలు	రూ. 25 వేలు
4	నెలవారీగా నివాస గృహాలు	రూ. 100
5	నెలవారీగా నివాసేతర గృహాలు	రూ. 200
6	నెలవారీగా ఆసుపత్రులు, రెస్టారెంట్లు, స్వీట్‌హౌజ్ ప్రైవేట్ హస్టళ్లు, షాపింగ్‌మాల్, ప్రైవేట్ విద్యా సంస్థలు, స్విమ్మింగ్‌పూల్, సినిమా హాళ్లు, పరిశ్రమలు, పెట్రోల్ పంపులు, ఫ్యాక్టరీలు, ఇతరాలు	రూ. 500

దేవుడే దిక్కు..!

- ధూపదీప నైవేద్యానికి నోచని ఆలయాలు
- పలు చోట్ల వివాదాల్లో ఆలయ భూములు
- పరిష్కారానికి చొరవ చూపని అధికారులు
- భూములున్న చోట పంట పండని వైనం
- ఈ నెల 24లోగా మరోసారి దరఖాస్తులు

దుబ్బాక, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆలయాలు నిత్య ధూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదు. ఆయా ఆలయాలకు పూర్వీకులు అందించిన భూములు అక్కరకు రాకపోవడం, భూములే కొలమానంగా ప్రభుత్వం ఈ పథకానికి ఆలయాలను ఎంపిక చేయడం వెరసి జిల్లాలోని పలు ఆలయాలు దీపధూప నైవేద్యానికి నోచుకోవడం లేదు. రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లాలోని ఆలయాలకే అత్యధికంగా డీడీఎన్ఎస్ పథకాన్ని అందిస్తున్నది ఎంత వాస్తవమో.. జిల్లాలో అంతేస్థాయిలో ఆలయాలు ఈ పథకానికి నోచుకోవడం లేదు అన్నది అంతే నిజమని భక్తులు అంటున్నారు. పలు ఆలయాలకు సంబంధించిన భూముల వివాదాలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపకపోవడం, రెవెన్యూ.. దేవాదాయ శాఖ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా జిల్లాలోని పలు ఆలయాలు ధూపదీప నైవేద్య పథకానికి దూరంగా ఉంటున్నాయి.

జిల్లాలో సుమారు 457 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద ఆర్థిక సహాయం అందుతోంది. ఈ నెల 24లోగా కొత్త ఆలయాలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. కేవలం రిజిస్టర్ అయిన, ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న ఆలయాలు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో జిల్లాలోని పలు చిన్న ఆలయాలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నాయి.

సగానికిపైగా భూములు వివాదాల్లోనే..

జిల్లాలో చాలా చోట్ల ఆలయాల భూములు వివాదాలల్లోనే చిక్కుకున్నాయి. దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో వేణుగోపాలస్వామి ఆలయ పేరిట గ్రామంలోని 417, 418 సర్వే నంబర్లలో మొత్తం 11 ఎకరాల 23 గుంటల భూమి ఉంది. ఏళ్ల నుంచి ఈ భూములు వివాదంలోనే ఉన్నాయి. రెవెన్యూ అధికారుల తీరుతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. మూడు దశాబ్దాలుగా ఈ భూముల్లో గింజ ధాన్యం పండిన దాఖలాలు లేవు. అనంతసాగర్‌లోని వేంకటేశ్వరాలయానికి దేవాదాయ శాఖ జాబితాలో సర్వే నంబర్ 21లో నాలుగు ఎకరాల కుష్కి ఇనాం భూమి, 467 సర్వే నంబర్‌లో 2 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఈ భూములన్నీ ఓ వ్యక్తి పేరుతో రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్నాయి. ఆలయం అధీనంలో కేవలం ఎకరా 15 గుంటలు మాత్రమే ఉంది. తొగుట మండలం ఎల్లరెడ్డిపేటలోని త్రికుంటేశ్వరాలయాలనికి కేవలం ఆరు గుంటల భూమే ఉంది. జిల్లాలోని పలు ఆలయాల భూములకు సంబంధించి పరిస్థితి ఇలాగే ఉంది.

పంటలూ పండవు..

దేవాదాయ శాఖ పరిధిలోని భూములను దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో వేలం వేసి సాగుకు అప్పగిస్తారు. అలా వేలం దక్కించుకున్న కౌలు రైతులు ఆ భూముల్లో సాగు చేసినా సరైన దిగుబడులు లేవంటూ చివరికి వేలం సొమ్ము చెల్లించకుండా చేతులు ఎత్తేసున్నారు. అకాల వర్షాలు, చీడపీడలు వంటి వాటితో కౌలు రైతులు నష్టపోతుండటంతో ఈ భూములపై ఆలయానికి కనీస ఆదాయం కూడా ఉండటం లేదు. దుబ్బాక మండలం ధర్మాజీపేట గ్రామ రామాలయం, చెల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయ భూముల విషయంలో ఇలాంటి పరిస్థితి ఉన్నట్లు సమాచారం. ఇక పలుచోట్ల ఆలయ భూములకు వేలం వేసినా కౌలుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. చేర్యాల మండలం ముస్త్యాలలోని ఓ ఆలయ భూమిని కౌలుకు తీసుకునేందుకు ఒక్క రైతు కూడా ముందుకు రాలేదని సమాచారం. కొమురవెల్లి మండలం పోచానిపల్లి రామలింగేశ్వరాలయానికి చెందిన పదెకరాల భూమి గ్రామ చెరువులో మునిగిపోయింది. ఇలా పలుచోట్ల ఆలయ భూముల్లో పంటలు పండి ఆదాయం వచ్చే అవకాశం లేకపోవడం, మరో పక్క ధూపదీప నైవేద్యం పథకానికి అర్హత లేకపోవడంతో ఆయా దేవాలయాల నిర్వహణ కష్టతరంగా మారింది.

గ్రామ దేవతలూ దూరమే..

గ్రామాల్లో కుల, గ్రామదేవతల విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేస్తుంటారు. అలాంటి ఆలయాలకు దేవాదాయ శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయాలనే అవగాహన ఉండదు. ఇలాంటి ఆలయాలకు ప్రత్యేకంగా పూజారులంటూ ఎవరూ ఉండరు. ఇలాంటి ఆలయాలు కూడా ధూపదీప నైవేద్యం పథకానికి నోచుకోవడం లేదు.



భూములున్నా పంటలు పండకపోవడంతో మూలనపడి జీర్ణావస్థలోకి చేరిన ఎనగుర్తి గ్రామ వేణుగోపాల స్వామి ఆలయం



సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘునందన్‌రావు

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు అందాలి

- దిశా సమావేశంలో ఎంపీ రఘునందన్‌రావు, మంత్రి పొన్నం
- వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సామాజిక బాధ్యతగా కృషి చేయాలని రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్‌లు కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. శుక్రవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు అధ్యక్షతన దిశా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన దిశా సభ్యులను పూలమొక్క అందించి అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం మాట్లాడుతూ విద్యాభివృద్ధి అనేది ఒక సామాజిక బాధ్యత అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ప్రజలు ప్రజా ప్రతినిధులు అందరూ సామాజిక బాధ్యతగా తీసుకుని జిల్లాలో విద్యాభివృద్ధి కృషి చేయాలన్నారు. అంతకుముందు ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రజలు అధికంగా లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన క్యాటిల్ షెడ్స్ ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ఎంపీ లాడ్స్ నుంచి మంజూరు చేయించిన 44 పనులు త్వరగా పూర్తిచేసి వివరాలు అందించాలని సూచించారు. 16, 17వ లోక్‌సభ ఎంపీ నిధుల ద్వారా మంజూరై, పూర్తి కాని పనులు, నిధుల వివరాలను అందించాలన్నారు. తొగుట మండలంలో ఇరిగేషన్ కాలువల తవ్వకం వలన వచ్చిన మట్టి, రాళ్లను ప్రజల ఉపయోగం కోసం కొంత రుసుముతో ఇవ్వాలని సూచించారు. ఎన్సాన్‌పల్లిలో రైతులకు వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జాతీయ రహదారి 765 డీజీపై 5 వెంటల్స్‌తో ఫ్లైఓవర్ నిర్మిస్తున్నామన్నారు. సూర్యాపేట సిరిసిల్ల రహదారిని దుద్దెడ, రాజీవ్ రహదారి నుంచి బైపాస్ ఏర్పాటు చేసి సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ మీదుగా వెళ్లేలా ప్రణాళికలు వేయాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరీమ అగ్రవాల్, డీఆర్డీవో పాల్గొన్నారు.

సాగు భారం

● యేటా పెరుగుతున్న పెట్టుబడులు ● వ్యవసాయంపై ధరల ప్రభావం

- మరోసారి పెరిగిన విత్తన ధరలు
- అందుబాటులోకి రాని సబ్సిడీ
- ఆశించిన స్థాయిలో పెరగని వ్యవసాయ ఉత్పత్తుల ధరలు

గజ్వేల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయమే ప్రధాన జీవనధారమైన జిల్లాలో పంటలపై రోజురోజుకు సాగుభారం ఎక్కువవుతున్నది. జిల్లాలో వానాకాలం పంటల సాగుకు చేలను సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వేసవి దుక్కుల పనులు జోరుగా సాగుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో రైతులపై పెట్టుబడి భారం అధికమవుతుంది. గతంలో కాడెద్దులతోనే రైతులు సాగు పనులు చేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఎక్కడ కనిపించడం లేదు. దీంతో అందుబాటులో ఉన్న ట్రాక్టర్ యంత్రాల సహాయంతోనే సాగు పనులు చేపడుతున్నారు. ఒక్కో గ్రామంలో పది నుంచి పదిహేను ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. దీంతో ఇంధన డిమాండ్ భారీగా పెరుగుతోంది. యేటా పత్తి విత్తన ధరలు పెరుగుతూనే ఉండగా, సబ్సిడీ విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నా.. దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెరగకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

మండుతున్న ఇంధన రేట్లు

జిల్లాలో లీటర్ పెట్రోల్ ధర రూ.107, లీటర్ డీజిల్ ధర రూ. 96గా ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు వేసవి దుక్కుల పనులు ఊపందుకోవడంతో ట్రాక్టర్లు కూడా బిజీగా మారిపోయాయి. పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ అమ్మకాలు కూడా ఎక్కువగానే కనిపిసున్నాయి. సీజన్ మొదలైన ఇంధన ధరలు తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులకు మరింత భారంగా మారింది. ఎండలు ముదిరిపోవడం, ఈ సమయంలోనే వేసవి దుక్కులు చేపడితే మంచి ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



పెరిగిన విత్తన ధరలు..

యేటా పత్తి విత్తన ధరలు పెరుగుతూనే ఉండగా, సబ్సిడీ విత్తనాలు అందుబాటులోకి రావడం లేదు. దీంతో రైతులపై ఆర్థికభారం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా ప్రధాన పంటల్లో పత్తి రెండోస్థానంలో ఉంటుంది. గతేడాది పత్తి విత్తన ధరలు రూ. 864 ఉండగా, ప్రస్తుతం రూ.37 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 450 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.901కి చేరింది. జిల్లా రైతాంగంపై రూ.కోటి 70లక్షల అదనపు భారం పడింది. సబ్సిడీ విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడంతో అయా కంపెనీలు పెంచిన ధరలకే విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సబ్సిడీ విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పెరుగుతున్న అద్దె, కౌలు ధరలు

ఇంధన ధరలకు అనుగుణంగానే ట్రాక్టర్ యజమానులు అద్దె ధరలను, కౌలు ధరలు పెంచడంతో అన్నదాతలపై అదనంగా భారం పడుతోంది. యేటా గంటకు రూ.100 నుంచి రూ.200 వరకు అద్దెలను పెంచేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసే విధంగా రైతులు సాగు పనుల్లో యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రతీ పనిని యంత్రాల సహాయంతోనే చేపడుతున్నారు. ప్రస్తుతం యంత్రాలతో వేసవి దుక్కులు దున్నడం, పంట చేలను చదును చేయడం, చెరువులు, కుంటల నుంచి నల్ల మట్టి, సేంద్రీయ ఎరువులను తరలించడం, పత్తి కర్రలను తొలగించడం లాంటి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇంధన ధరలు పెరిగాయన్న సాకుతో ట్రాక్టర్ యజమానులు అద్దెలను అమాంతంగా పెంచేస్తున్నారు. కౌలు ధరలను సైతం రైతులు పెంచుతున్నారు. మెట్ట పొలం అయితే రూ.10వేల నుంచి రూ.15వేలు ఉండగా, తరి పొలం రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పలుకుతుంది.

యేటా రూ.కోట్ల భారం

జిల్లాలో మొత్తం 2.40లక్షల మంది రైతులు ఉండగా 5.60లక్షల ఎకరాల్లో యేటా వివిధ పంటలను సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం ఎకరానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చయ్యేది. ప్రస్తుతం రూ. 25వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరతతో యంత్రాల వినియోగం విపరీతంగా పెరుగుతుంది. యేటా రూ.కోట్ల భారం రైతులపై పడుతుంది.

బాల్య వివాహం నిలిపివేత

నర్సాపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలం పరిధి గొల్లపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. సీడీపీవో హేమభార్గవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ తండాకు చెందిన బాలికకు గుమ్మడిదల మండలానికి చెందిన వ్యక్తితో శుక్రవారం వివాహం జరిపిస్తున్నారు. సమాచారం అందుకున్న సీడీపీవో పోలీసులతో కలిసి అక్కడికి వెళ్లి ఇరు కుటుంబాలకు నచ్చజెప్పి వివాహాన్ని నిలిపివేయించారు. అనంతరం బాలికను మెదక్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కేంద్రానికి తరలించారు.



రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్‌ను కమ్ముకున్న చిమ్మ చీకటి

ప్రమాదాలు జరుగుతున్నాయి..



రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ విద్యుత్ దీపాలు లేక పోవడంతో రాత్రిళ్లు ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఆరుగురు మృత్యువాత పడ్డారు.

-ఈశ్వరీగారి రమణ

బైక్‌పై రావాలంటే భయమే..



విద్యుద్దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఈ దారిగుండా బైక్‌పై ప్రయాణించాలంటే జనం భయపడుతున్నారు. దశాబ్దాల క్రితం రాత్రి సమయాల్లో ఎలా ప్రయాణాలు సాగించామో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొన్నది.

-విష్ణు ముదిరాజ్

ఈ దారి.. చీకటి దారి

● అంధకారంలో రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్
● విద్యుద్దీపాల ఏర్పాటుపై అధికారుల నిర్లక్ష్యం

రామచంద్రాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ నేటికి పూర్తి కాలేదు. మండలంలోని గోపన్‌పల్లితండా నుంచి కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్) వరకు 7 కిలోమీటర్ల మేర చేపడుతున్న ఈ రోడ్డును బీటీతోనే సరిపెట్టారు. అదీకూడా గుంతలుగా ఉన్నది. ఈ దారిలో విద్యుద్దీపాలను ఏర్పాటులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో ఈ దారిగుండా ప్రయాణించాలంటే ప్రజలు హడలెత్తి పోతున్నారు. తెల్లాపూర్ నుంచి కొల్లూరు వరకు చీకట్లలోనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. యువతులపై అత్యాచారం జరిగినా గుర్తించలేని పరిస్థితి నెలకొన్నది. అంతేకాకుండా ఈ రోడ్డును ఓ ప్రణాళికాబద్ధంగా నిర్మించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ విద్యుత్ ఏఈ మోనికను వివరణ కోరగా ఆ పనులు ఆర్‌అండ్‌బీ చేపడుతుందని చెప్పారు. ఆర్‌అండ్‌బీ అధికారిని వివరణ కోరే ప్రయత్నం చేయగా జవాబును దాటవేశారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరి, అధికారులు

నేడు కొండాపూర్‌కు ముగ్గురు మంత్రులు

● భూ భారతి రెవెన్యూ సదస్సుకు హాజరు
● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, అధికారులు

కొండాపూర్,మే16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి అమలుకు పైలెట్ ప్రాజెక్ట్‌గా కొండాపూర్ మండలాన్ని ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం మండలకేంద్రమైన కొండాపూర్‌లో భ భారతికి సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ, మంత్రి దమోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. ఇందులో భాగంగా మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరించనున్నారు. అయితే 40 నుంచి 50 ఏళ్ల ప్రభుత్వ భూములను సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్న చాలామంది రైతులకు ధరణి పోర్టల్ వచ్చాక కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రులు రెవెన్యూ సదస్సుకు హాజరవుతున్న వేళ సదరు సమస్యకు పరిష్కారం లభించనుందని పలువురు రైతులు చర్చించుకుంటున్నారు. మంత్రుల రాకను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి సభా స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని, కొండాపూర్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తుల ప్రక్రియ త్వరగా పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆత్మకమిటీ ఛైర్మన్ ప్రభు, డీఏవో శివప్రసాద్, ఏడీఏ వెంకటలక్ష్మి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, డీటీలు మల్లేశం, ప్రదీప్, ఆర్ఐలు రాజు, రాంచందర్, పీఏసీఎస్ ఛైర్మన్ మానిక్‌రెడ్డి, ఏవో గణేష్, ఏఈవోలు రవి, ప్రేమ్‌రాజ్ రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం కక్ష

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

అక్కన్నపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా మావోయిస్టులతో చర్చలు జరపకుండా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కాగార్ పేరుతో మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీరు సత్యనారాయణ, కోయ్యడ కొమురయ్య, ఎడల వనేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో ర్యాలీలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

రైతులకు సాగునీరు అందివ్వని కాళేశ్వరం ప్రాజెక్టు

హుస్నాబాద్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు సాగు నీరు అందివ్వడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు ప్రారంభించి 17 ఏళ్ల గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. ఈ నెల 29న గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో గతంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని కూల్చివేయకుండా ప్రత్యామ్నాయ నిర్మాణాలు చేపట్టాలన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

హవేళిఘణపూర్, మే 16,(ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని డైట్ కళాశాలలో ఉపాధ్యయుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి కలిగించే విధంగా బోధన ఉండాలన్నారు. సాంఘికశాస్త్రం, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులవారీగా రిసోర్స్ పర్సన్ ద్వారా ఉపాధ్యాయులకు మూడు విడతల్లో గుణాత్మక శిక్షణ ఉంటుందన్నారు. తరువాత తెలుగు, హిందీ, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి శిక్షణ అందిస్తామన్నారు. బోధన సామర్థ్యాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన భర్తపై కేసు

తూప్రాన్, మే 16(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై భార్యపై వేధింపులకు పాల్పడుతున్నాడో భర్త. దీంతో ఆమె భరించలేక పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. ఈ సంఘటన తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటోళ్ల కిష్టయ్యకు బాలమణితో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా మద్యానికి బానిసై భార్య బాలమణిని శారీరక, మానసిక వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భర్త కిష్టయ్యపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన కారు

● దంపతులకు తీవ్ర గాయాలు





కొండపాక, మే 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో దంపతులకు తీవ్రగాయలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే.. సిద్దిపేట పట్టణానికి చెందిన కనకాచారి, రత్నమాల దంపతులు ద్విచక్రవాహనంపై చేర్యాలకు బంధువుల వివాహానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు వస్తున్న కారు ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కనకాచారికి కాలు చేయి, ఆయన భార్యకు కాలు విరిగినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో ఎడ్లు మృతి

జహీరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రంజోల్‌లో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతి చెందాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని తయ్యాబ్ ఫంక్షన్‌హాల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్తింగ్ వైరుకు 11కేవీ విద్యుత్ వైరు ఆనుకుని ఉన్నది. శుక్రవారం అటుగా వస్తున్న ఎడ్లు ఆ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలన్నారు. మృతిచెందిన ఎడ్ల విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.



ధాన్యం తరలింపునకు లారీల కొరత

● ఐఎంఎల్ డిపో ఎదుట రైతుల పడిగాపులు

కొల్చారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసి బస్తాల్లో నింపినా లారీ కొరతతో మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో అకాల వర్షాలకు ధాన్యం బస్తాలు తడిసి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొల్చారం మండలంలో చిన్నఘనపూర్, పైతర, మాందాపూర్, రాంపూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. కొంతమంది రైతుల ధాన్యం మూడు రోజుల క్రితం తూకం వేసినా లారీలు అందుబాటులో లేక తరలించకపోవడంతో నీటిపాలైంది. దీంతో శుక్రవారం చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన రైతులు పెద్ద ఎత్తున ఐఎంఎల్ డిపో ఎదుట లారీల కోసం పడిగాపులు కాశారు. అలాగే పైతర, మాందాపూర్ గ్రామాలకు చెందిన రైతుల ధాన్యం తడిసిపోవడంతో మళ్లీ ఆరబెట్టారు. ఉన్నతాధికారులకు ఫోన్ చేసినా సరైన సమాధానం ఇవ్వడంలేదని పైతర మాజీ సర్పంచ్ ఎల్లేశం తెలిపారు. కొంతమంది రైతుల ధాన్యం మొలకలు కూడా వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లారీల కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



లారీల కోసం ఐఎంఎల్ డిపో ఎదుట ఎదురుచూస్తున్న రైతులు



శివ్వంపేట కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యం

శివ్వంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో ధాన్యం తూకం వేయకపోవడం, లారీల కొరతతో ధాన్యం బస్తాలను లిఫ్ట్ చేయకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం బస్తాలు తడిసి మొలకెత్తడంతో రైతులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో మండల పరిధిలోని శివ్వంపేట, చిన్నగొట్టిముక్ల, పెద్దగొట్టిముక్ల, గోమారం, సికింద్లాపూర్ గ్రామాల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం బస్తాలు మొలకెత్తడంతో తడిసిన ధాన్యం బస్తాలను మరల ఆరబెట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. అధికారులు స్పందించి తమ గోడును అర్థం చేసుకొని ప్రకృతి వైపరీత్యా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

కర్కపట్లలో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

మర్కుక్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్కపట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి, అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడపవద్దని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేధింపులపై మహిళలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. యువత చదువుపై శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగ నోటిఫికేషన్‌లను వేస్తున్నదని చెప్పారు. బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఇంటిపై రైడ్ చేసి 10.70 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, ప్రొబెషనరీ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో విద్యాబోధన చేయాలి

● గవర్నమెంట్ ఎగ్జామినేషన్ డైరెక్టర్, సిద్దిపేట జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణారావు

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరంలో నూతనోత్సహంతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని గవర్నమెంట్ ఎగ్జామినేషన్ డైరెక్టర్, సిద్దిపేట జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణారావు ఉపాధ్యాయులకు సూచించారు. సిద్దిపేట జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ క్లాసులను, విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని, కేజీబీవీ సమ్మర్ క్యాంప్ తరగతులు, ప్రతి శుక్రవారం జరిగే మెగా తల్లిండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని ఆయన సందర్శించారు. జిల్లాలో జరుగుతున్న విద్యాపరమైన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్ తదితరులు ఉన్నారు.



ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని సందర్శించిన కృష్ణారావు

ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● గజ్వేల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి స్వాతి


మాట్లాడుతున్న గజ్వేల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి స్వాతి

మర్కుక్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మూల స్వాతి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి రమాదేవి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వృద్ధుల వరకు ప్రతీ ఒక్కరికి చట్టాలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. న్యాయవాదులు అందుబాటులో ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు వాహనాలను ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదవుతుందని హెచ్చరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలను నడపొద్దని సూచించారు. 20-25 ఏళ్ల మధ్య గల యువకులు ఎక్కువగా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పోలీసులకు పట్టుబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్ రాజు, సభ్యులు పండరీ, ఎన్.సుదర్శన్, రామకృష్ణ, శ్రీనివాస్, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, మర్కుక్ పోలీస్ సిబ్బంది కృష్ణ, శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, హోంగార్డు రాములు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థినులతో రీజియన్ కోఆర్డినేటర్

చేగుంట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మెదక్ రీజియన్ పరిధిలోని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉన్న ఆరు గిరిజన బాలికల గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్‌ను శుక్రవారం ప్రారంభించారు. చేగుంట గురుకుల కళాశాలలో రీజియన్ కోఆర్డినేటర్ గంగారం నాయక్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని చేగుంట, మెదక్, నర్సాపూర్ (నారాయణపూర్) కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, హనుమాజీపేట్, నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి కళాశాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సాపూర్ (నారాయణపూర్) కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ, కళాశాలలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు, కామారెడ్డి జిల్లాలోని హనుమాజీపేట్ కళాశాలలో ఎంపీసీ 35 సీట్లు, బైపీసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 26 వరకు గడువు ఉన్నందున బాలికల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కౌన్సెలింగ్‌లో రీజినల్ కోఆర్డినేటర్ గంగారం నాయక్‌తో పాటు, ప్రిన్సిపాల్‌లు సునీత, లలితాదేవి, వాణి, పద్మజ, శ్యామలాదేవి, సావిత్రి పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షను తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది స్వీకరిస్తారు. వారివారి నిత్యమైన పనులను చేస్తూనే నిష్టతో, ఆంజనేయ నామస్మరణతో దీక్షను పాటించే స్వాములు భిక్షను (అన్నప్రసాదం) ఆయా సమయాను సారం తీసుకుంటారు. అలాంటి భిక్షను అందించటం పుణ్యకార్యంగా భావిస్తుంటారు. మాలధారులకు మహా ప్రసాదం అందించే మహాభాగ్యంలో సిద్దిపేటలోని పలు సేవా సంస్థలు పాలు పంచుకుంటున్నాయి.


రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ భవనంలో భిక్షను స్వీకరిస్తున్న భక్తులు

మాలధారులకు మహాప్రసాదం

భిక్ష ఏర్పాటు చేస్తున్న ధార్మిక సంస్థలు

వేల సంఖ్యలో స్వీకరిస్తున్న దీక్షదారులు

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత హనుమ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ నేతృత్వంలో 1983వ సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది మంది భక్తులతో మాలధారణ ప్రారంభమైంది. ప్రస్తుతం ఎల్లలు దాటి లక్షల్లో హనుమాన్ దీక్ష స్వీకరిస్తున్నారు. 108 రోజులు, 41 రోజులు (మండల దీక్ష), 21 రోజులు (అర్ధమండల దీక్ష), 11 రోజులు (ఏకాదశ దివస) దీక్షలను పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ భక్తులలో పేద, మధ్య తరగతి వారు కూడా మాలధారణ చేసి కష్టాలు తీరాలని వేడుకుంటారు. ప్రతీరోజు వివిధ రకాల వంటలతో, నిష్టగా వంట చేయడం కొంత ఆర్థికంగా, మరొరకంగా కూడా ఇబ్బంది అవుతుంది. ఈ ఇబ్బందిని గ్రహించిన సిద్దిపేటలోని ధార్మిక సంస్థలు స్వాములకు నిత్యం భిక్షను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సౌకర్యం అందుబాటులో ఉండడంతోనూ సిద్దిపేట పట్టణం, పరిసర ప్రాంతాల్లో హనుమాన్ దీక్షదారులు ఏటేటా పెరుగుతూనే ఉన్నారు.

శ్రీరామరాజు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

స్వాములకు భిక్షకు అవుతున్న ఇబ్బందిని గ్రహించిన సిద్దిపేట పారుపల్లి వీధిలోని రావిచెట్టు హనుమాన్ ఆలయం సభ్యులు 2006లో మహాప్రసాద కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సేవా శాశ్వతంగా ఉండాలనే సదుద్దేశంతో 2010లో శ్రీరామరాజు హనుమాన్ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. 2011లో ట్రస్ట్ కోసం ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు నిత్యం హనుమాన్ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శ్రీరామనవమి మొదలుకొని హనుమాన్ జయంతి వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు భిక్షను అందిస్తారు. 21 రోజులు, 11 రోజుల దీక్ష ప్రారంభమయ్యాక 4 గంటల వరకు కూడా భిక్ష కార్యక్రమం కొనసాగిస్తారు. సుమారుగా 8 వందల నుంచి 9 వందల స్వాములు భిక్షను స్వీకరిస్తారు. అంజన్న సేవలో తరించడానికి చాలా మంది భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భిక్ష సేవలో పాల్గొంటారు. భవనం నాలుగో అంతస్తులో వంటగదిని ఏర్పాటు చేసి వంటలు తయారుచేస్తుంటారు. రుచికరమైన, శుచికరమైన వివిధ రకాల వంటలను స్వాములకు ఏర్పాటు వడ్డిస్తున్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

సిద్దిపేట గణేష్‌నగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలోనూ భక్తులకు భిక్ష ఏర్పాటు ఉంటుంది. ఇక్కడ అక్షయ తృతీయ నుంచి మొదలుకొని హనుమాన్ జయంతి వరకు 23 రోజులపాటు అందజేస్తారు. 2008లో షామియానాలు వేసి భక్తులకు 11 రోజుల భిక్షను ఏర్పాటు చేశారు. అనంతరం 30 మందితో ట్రస్ట్‌గా ఏర్పడి 2016లో చిన్నజీయర్ స్వామిజీ చేతులమీదుగా నూతన భవనం నిర్మించారు. 120 మంది ట్రస్ట్ సభ్యుల సహకారం, దాతల ప్రోత్సాహంతో భిక్షను అందిస్తున్నారు. ఈ రెండు ఆలయాలే కాకుండా పట్టణంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో దాతల సహకారంతో భిక్ష కార్యక్రమం కొనసాగుతున్నది.


ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ట్రస్ట్ భవనంలో స్వాములకు భిక్ష


రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ భవనం

ఫారెస్ట్ అధికారులకు జింకను అప్పగించిన యువకులు

బెజ్జంకి, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండారంలో అస్వస్థతకు గురైన ఓ జింకను గమనించిన యువకులు ఫారెస్టు అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. వేసవి కావడంతో దప్పిక తీర్చుకోవడానికి శుక్రవారం గుండారం శివారులోని ఓ మామిడి తోటలోకి వచ్చిన జింక అస్వస్థతకు గురై కనిపించింది. గమనించిన గ్రామానికి చెందిన కొందరు యువకులు ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చి జింకను అప్పగించారు. జింకను అప్పగించిన శ్రీధర్‌రెడ్డి, రాము, నరేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిలను గ్రామస్థులు అభినందించారు.


జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తున్న గుండారం గ్రామ యువకులు

ధాన్యం తూకంలో మోసం.. కేసు నమోదు

జిన్నారం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిన్నారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకంలో జరుగుతున్న మోసాలపై రైతుల పిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు చేశారు. రెండు ఎలక్ట్రానిక్ తూకం మిషన్లను పరిశీలించగా.. 20 కేజీలకు గానూ 700 నుంచి 800 గ్రాముల చొప్పున తూకం తక్కువగా నమోదవుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై కేసునమోదు చేసి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌డీఏ అధికారులు కూడా కేంద్రాన్ని సందర్శించి, నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి నోటీసులు జారీ చేశారు.


కొనుగోలు కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రమణీయం.. రంగనాథస్వామి కల్యాణం



అందోలులో రంగనాథస్వామి కల్యాణంలో మంత్రి దామోదర్, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

జోగిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : అందోలు పట్టణంలోని ప్రాచీన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చివరి ఘట్టమైన రంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అనువంశిక పూజారి శ్యాంనాథ శర్మ ఆధ్వర్యంలో, అర్చకులు వైష్ణవాగమ పద్ధతిలో క్రతువును నిర్వహించారు. అమ్మవార్ల తరపున మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, శేరి సునీత(మాజీ జడ్పీటీసీ) క్రతవులో పాల్గొన్నారు. ఈ కల్యాణోత్సవంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో మంత్రి కల్యాణ ఘట్టంలో పాలుపంచుకున్నారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్టును దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంత్రికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు.

వైభవంగా పెద్దిరాజు, పెద్దమ్మ కల్యాణం

చిన్నశంకరంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరారం గ్రామ పెద్దమ్మ ఆలయం వార్షికోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. చివరి రోజైన శుక్రవారం పెద్దమ్మ, పెద్దిరాజులకు పట్నాలు, కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా బోనాలను ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఒగ్గు కళాకారులతో ఒగ్గు కథా కాలక్షేపాన నిర్వహించారు.

వీరభద్రుడికి ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

టేక్మాల్, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొడ్మాట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రామస్థులు ఎడ్లబండ్ల ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. బండ్లను రంగురంగుల చమ్కీలు, కాగితాలు, వస్త్రాలతో అందంగా అలంకరించారు. డప్పుచప్పుళ్ల మధ్య, యువకులు ఉత్సాహంగా చిందులు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉత్సవంలో భాగంగా శనివారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ తెలిపారు.



242 రకాల మామిడి పండ్ల ప్రదర్శన


సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్‌లో ప్రదర్శించిన మామిడి రకాలను చూస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

సంగారెడ్డి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఆచార్య జయశంకర్ ఫల పరిశోధన కేంద్రం(ఎఫ్ఆర్ఎస్)లో శుక్రవారం మామిడి పండ్ల ప్రదర్శనను ప్రారంభించారు. ఇందులో 242 రకాల పండ్లను ప్రదర్శించారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, భారత ఉద్యాన పరిశోధన విశ్వవిద్యాలయం(ఐఐహెచ్ఆర్, బెంగుళూరు)- ఫల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్‌పాటిల్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు.

ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయాలి

సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్‌లోని మామిడిపండ్ల ఎగుమతి ప్రపంచ వ్యాప్తంగా జరగాలని ఆకాంక్షించారు. మామిడి సాగునె ఎక్కువగా మన వద్దే చేస్తారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ రకాల మామిడిని ఎలా పండించాలో అవగాహన కల్పించేందుకు పండ్ల ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ఫల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఐఐహెచ్ఆర్-బెంగుళూరు) డాక్టర్ ప్రకాష్ పాటిల్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. మామిడి సాగులో సాంకేతిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. మామిడిలో వందల రకాలున్నాయని వాటిపై అవగాహన పెంచుకుని సాగు చేస్తే నష్టం వాటిల్లదని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు దళారుల ఆగడాలను అరికట్టాలని కోరారు. తక్కువ ధరలకు తీసుకుంటున్నారని, పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని వాపోయారు. మామిడిపండ్లను అస్త్రబల్‌లో కూడా విక్రయించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకుడు డా.లక్ష్మీనారాయణ, విస్తరణ సంచాలకుడు డా.సురేష్‌కుమార్, డీఆర్వో పద్మజా రాణి, ఉద్యానవన అధికారి సోమేశ్వర్‌రావు, ఎఫ్ఆర్ఎస్ శాస్త్రవేత్త డా.సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

● రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ

మెదక్ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ సూచించారు. పది, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మెదక్ మిల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ పట్టణంలోని స్థానిక క్రిస్టల్ గార్డెన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమానికి తారిఖ్ అన్సారీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, కళాశాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లానాయక్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీఆర్ఎస్ కన్వీనర్ ఆంజనేయులు, మిల్లి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ ఒమర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హైబ్రిడ్ మోడల్ రోడ్లకు సర్వే

● హమ్ పథకం ద్వారా మొదటగా గజ్వేల్ నియోజకవర్గంలోని మూడు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

తూప్రాన్, మే 16(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో హమ్ (హైబ్రిడ్ అన్యూటీ మోడల్) పథకం ద్వారా రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మూడు రోడ్లకు ప్రతిపాదనలు చేయగా, శుక్రవారం ఏఈ మధుసూదన్ సర్వే నిర్వహించారు. హైబ్రిడ్ మోడల్ ద్వారా మొదటగా గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ పరిధిలో మూడు రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని పాత హైవేరోడ్డు నుంచి గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ అంబేడ్కర్ విగ్రహం వరకు 12 కిలోమీటర్ల పొడవు అభివృద్ధి చేయనున్నారు. అల్లాపూర్ చౌరస్తా నుంచి కిష్టాపూర్ మీదుగా వెంకటాయపల్లి చౌరస్తా వరకు 8 కిలోమీటర్లు రెండో రోడ్డు, తూప్రాన్ పట్టణంలోని సొసైటీ సమీపంలోని ఎస్సీ కాలనీ మీదుగా ఆబోతుపల్లి, రత్నాపూర్, ఇస్లాంపూర్ వరకు 2.61 కిలోమీటర్ల పొడవు మూడో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీరాజ్ ఏఈ మధుసూధన్ ఆధ్వర్యంలో లాన సంస్థ సర్వే పనులను చేపట్టింది. ఆబోతుపల్లి - గౌడిగూడెం మధ్య హల్దీవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని రైతులు, గ్రామస్థులు కోరారు. గతంలో కాజ్‌వే నిర్మాణం చేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కాజ్‌వే మీదుగా నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్వే పనులు నిర్వహిస్తున్న సమయంలో గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడకు చేరుకొని బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. భారీ వర్షాలు కురిసిన సమయంలోనూ రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణం చేయాలని సూచించారు. బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఏఈ మధుసూదన్ వివరించారు. సర్వే సంస్థ లాన ఇంజనీర్లు పులి అగస్టిన్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.


తూప్రాన్ శివారులో సిబ్బందితో సర్వే నిర్వహిస్తున్న ఏఈ మధుసూదన్

గణితంలో గీతం విద్యార్థిని లావణ్యకు డాక్టరేట్

పటాన్‌చెరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని డాక్టరేట్‌కు అర్హత సాధించారు. విద్యార్థిని కె.లావణ్య సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



న్యూస్ బాక్స్

దేవాలయానికి గ్రానైట్ అందజేసిన మాజీ మంత్రి

సిద్దిపేట రూరల్, మే16 (ఆంధ్రజ్యోతి): బీరప్ప దేవాలయానికి లక్ష రూపాయల విలువ చేసే గ్రానైట్‌ను మాజీ మంత్రి అందజేశారు. అందుకు శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటపూర్ గ్రామం బీరప్ప ఆలయ కమిటీ మరియు బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నిర్మిస్తున్న బీరప్ప ఆలయానికి తమ వంతుగా ఆర్థిక సాయం అందించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును కోరగా లక్ష రూపాయలు విలువ చేసే గ్రానైట్‌ను అందించాలరని తెలిపారు.

సత్తాచాటిన మైనార్టీ గురుకుల విద్యార్థులు

దుబ్బాక, మే16 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదవతరగతి, ఇంటర్ ఫలితాల్లో దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు మండలస్థాయిలో సత్తాచాటారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్‌ను పదవ తరగతిలో మండల టాపర్‌గా హరీష్ 573మార్కులు, ఇంటర్మీడియట్‌లో 968 మార్కులు సాధించిన జహీర్‌లతో కలిసి ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో విద్యార్థులను అభినందించి, శాలువతో సన్మానించారు.

దిశ కమిటీ సభ్యులుగా రాజు,శివకుమార్

తొగుట, /గజ్వేల్ మే 16 (ఆంధ్రజ్యోతి): దిశ(జిల్లా అభివృద్ధి, సమన్వయం-పర్యవేక్షణ కమిటీ) సభ్యులుగా రాజు,శివకుమార్ నియమితులయ్యారు. తొగుట మండలం పెద్దమాసాన్ పల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు తోలుకంటి రాజు నియమితులయ్యారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల ప్రకారం మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు సూచన మేరకు జిల్లా దిశ మెంబర్‌గా నియమించారు. ఈ సందర్భంగా తోలుకంటి రాజు, శివకుమార్ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు నేరుగా అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

గ్యాంగ్‌వార్ ఘటనలో 17మంది బైండోవర్

చేర్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చేర్యాల పెద్దచెరువుకట్టపై గ్యాంగ్‌వార్‌కు పాల్పడిన కేసులో 17మందిని బైండోవర్ చేసినట్లు ఎస్సై నీరేశ్ తెలిపారు. శుక్రవారం ఇరువర్గాలకు చెందిన 17మందిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ చేశామని, సత్ప్రవర్తనతో మెదలాలని సూచిస్తూ బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

సాహిత్య సన్మానం అందుకున్న కవి వెంకట్

చేర్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పద్యకవి వెంకట్ రాష్ట్రస్థాయి సాహిత్య సన్మానం అందుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో వెంకట్ ఇటీవల రచించిన కవిత సంకలనం ప్రచురితం చేశారు. ఈనేపథ్యంలో తెలంగాణ భాషాసాంస్కృతికశాఖ, కరీంనగర్ భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాదు రవీంద్రభారతిలో నిర్వహకులు వెంకట్‌ను సన్మానించారు.

విద్యార్థులను అభినందించిన గ్రామస్థులు

ధూళిమిట్ట, మే16 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయుల-విద్యార్థుల తల్లితండ్రుల సమావేశాన్ని ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో మూడవ స్థానం, మండలంలో ప్రథమ స్థానంలో ధూళిమిట్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని గ్రామంలోని తల్లితండ్రులు తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు.

నేటి నుంచి స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినిపురలో కొలువైన శ్రీ వేంకటేశ్వరాలయం సర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. నేటి నుంచి 23 వరకు జరిగే ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.




కొడకండ్ల గ్రామంలో దారి పొడవునా వరి ధాన్యం కుప్పలు.

దారులే కల్లాలు.. గాలిలో ప్రాణాలు

- దారిపొడవునా ధాన్యం కుప్పలతో తరచూ ప్రమాదాలు
- పొలాల వద్ద కల్లాలు లేకపోవడంతో రోడ్లపై ఆరబోత

గజ్వేల్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. వరికోతలు మొదలైనవి అంటే రోడ్లన్నీ కల్లాలను తలపిస్తుండడమే దీనికి కారణం. సగం రోడ్లు ధాన్యం కుప్పలతో ఆక్రమిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గజ్వేల్ మండలంలోని పలు గ్రామాల్లో దారులన్నీ ధాన్యం కుప్పలతో దర్శనమిస్తున్నాయి. పొలాల దగ్గర కల్లాలు లేకపోవడంతో రోడ్లపైన ధాన్యం కుప్పలు పోయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటను ఆరబెట్టుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. కల్లాలు అందుబాటులో లేక ప్రతీసారి ఇదో సమస్యగా మారింది. తేమ శాతం ఎక్కువగా లేకుండా చేసుకోవడానికి ధాన్యం ఆరబోతకు రైతులు రహదారులను ఆశ్రయిస్తున్నారు. కల్లాల నిర్మాణానికి ఐదేళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించినప్పటికీ నిబంధనలు అడ్డొచ్చి ఎవరూ ముందుకు రాలేదు. ప్రత్యామ్నాయం లేక సగం రోడ్లను ఆక్రమిస్తూ ధాన్యం ఆరబోస్తున్నారు. దీని వల్ల వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి వేళ వరి ధాన్యం కుప్పలు, వాటికి అడ్డుగా పెట్టిన రాళ్లు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో పలుచోట్ల రోడ్లపై ధాన్యం కుప్పలను ద్విచక్రవాహనదారులు ఢీకొని ప్రాణాలు కోల్పోయినా సంఘటనలూ లేకపోలేదు.

మల్లన్న భక్తులకు ఎస్‌బీఐ సేవలు

చేర్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండల ప్రజలతో పాటు మల్లన్న భక్తులకు ఇకనుంచి ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు అందనున్నాయి. కొమురవెల్లిలో చాన్నాళ్లక్రితం టీజీబీ ఉన్నప్పటికీ పూర్తిస్థాయి సేవలు లేవు. ఎస్‌బీఐ సేవలకోసం సిద్దిపేట, చేర్యాలకు తరలి వెళ్తూ ఇబ్బందులుపడుతున్నారు. కొన్నాళ్లక్రితం ఎస్‌బీఐ ఉన్నతాధికారులు కొమురవెల్లిలో బ్యాంకు ఏర్పాటుపై హామీ ఇచ్చారు. ఆలయ సమీపంలోని ప్రధాన రహదారి పక్కన ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఫర్నీచర్, సాంకేతిక పరికరాల బిగింపు పూర్తిచేసి ప్రాథమిక లావాదేవీలను ఇటీవల ప్రారంభించారు. ఇతర బ్రాంచిలో కొనసాగుతున్న స్థానికులు, మండలపరిధిలోని వినియోగ దారుల ఖాతాను మళ్లింపు, నూతన ఖాతాల ప్రారంభం ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అలాగే బ్యాంకు సమయం ముగిసిన అనంతరం నగదు డిపాజిట్, విత్‌డ్రాయింగ్ కోసం అధునాతన ఏటీఎంను నెలకొల్పారు. మరికొద్దిరోజుల్లో బ్యాంకు ఉన్నతాధికారులతో బ్రాంచ్ ప్రారంభానికి కసరత్తు చేస్తున్నారు.

కొమురవెల్లి మల్లన్నదర్శనార్థం నిత్యం వందలాదిగా, మూడునెలల జాతరలో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. స్థానికంగా ఏటీఎం లేకపోవడంతో డబ్బులు అత్యవసరపడిన భక్తులు స్థానికంగా చిరుదుకాణాలను ఆశ్రయించగా, రూ.1000కి రూ.30-50కమీషన్ తీసుకుంటుండటతో ఇబ్బందులుపడుతున్నారు. అధికారులు ఏటీఎం ఏర్పాటుపై కాస్త నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పటికీ, చివరకు ఎస్‌బీఐ బ్రాంచి ఏర్పాటుతో ఏటీఎం అందుబాటులోకి రావడంతో ఇక కమీషన్ల బారినుండి ఉపశమనం పొందనున్నారు. జాతర సమయంలో రద్ధి దృష్ట్యా నెట్‌వర్క్ ఏరియల్ ఫ్రీక్వెన్సీ తగ్గి ఫోన్లు పనిచేయని నేపథ్యంలో ఏటీఎం పనితీరు ఎలా ఉంటుందోనని ఆందోళన నెలకొన్నప్పటికీ ఎస్‌బీఐ సేవలు పొందడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొమురవెల్లిలో ఎస్‌బీఐ బ్యాంకు

ఆకట్టుకుంటున్న ప్రభుత్వ పాఠశాల ప్రచారం

కోహెడ/చిన్నకోడూరు/మిరుదొడ్డి/నంగునూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాలలో ప్రభుత్వ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించమని కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలకు సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల తరహాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటి నుంచే గ్రామంలో ముమ్మరంగా పర్యటిస్తూ ప్రభుత్వ పాఠశాలలోని సౌకర్యాలు, విద్యాబోధన గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో ఉపాధి హామీ పనుల వల్ల ఉదయం వేళలో ప్రజలు అందుబాటులో ఉండకపోవడంతో శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ఉపాధి హామీ పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి అక్కడ వారితో సమావేశం నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరిని ప్రైవేట్ పాఠశాలలో కాకుండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

కోహెడ

కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామంలో శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ముందస్తుగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రైవేటు బడులకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు రావాలని కోరారు.

మిరుదొడ్డి

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మిరుదొడ్డి ఎంఈఓ ప్రవీణ్‌బాబు సూచించారు. శుక్రవారం మిరుదొడ్డి మండలం అందె, మల్లుపల్లి గ్రామాల్లో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి బడికి వెళ్లే విద్యార్థుల వివరాలను సేకరించారు.

నంగునూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని మగ్దుంపూర్ హైస్కూల్ హెచ్‌ఎం దాసరి సుధాకర్ అన్నారు. ముందస్తు బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామ చావిడి వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ పాఠ్యాంశాలను బోధిస్తామని తెలిపారు.

సీఎంకు పదవి పోతుందని భయం

- బీఆర్ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిపై అభద్రతాభావంతో పరిపాలన కొనసాగించలేకపోతున్నారు. పదవి పోతుందనే భయంతోనే ముఖ్యమంత్రి తానే అన్న విషయం కూడా మర్చిపోతున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పాల సాయిరాం, ఎడ్ల సోమిరెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎల్లారెడ్డి అన్నారు. కల్లాలలో రైతులు అల్లాడుతుంటే అందాల భామల పోటీల వెంట ముఖ్యమంత్రి తిరగడం సిగ్గుచేటు అన్నారు. అధికారంలోకి వచ్చిన అనాధికాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత పొందిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, పరశురాం గౌడ్ తో కలిసి వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేక పోయిందన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో ఉందన్న ముఖ్యమంత్రి.... అటు వెంబడే ఆర్టీసీ ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచుదామంటే అప్పు కూడా పుట్టడం లేదని మాట్లాడటం ఏమిటో తమకు అర్థం కాలేదన్నారు. తరచూ ముఖ్యమంత్రులను మార్చే కాంగ్రెస్ పార్టీపై తనకు నమ్మకం లేకే తను ముఖ్యమంత్రిని అన్న విషయం కూడా రేవంత్ రెడ్డి మర్చిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలనపై పట్టు రాలేదని, అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా ఫెయిల్ అని ఆరోపించారు. రైతుబంధు, రైతు రుణమాఫీ ఇప్పటికి పూర్తి చేయలేకపోయారని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కూడా అంతంత మాత్రమేనని ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

'పన్ను' పోటు

(5వ పేజీ తరువాయి)

సమయంలో పట్టణంలో దాదాపు అన్నీ గృహలకు యూజీడీ కనెక్షన్‌ను ఉచితంగా కల్పించారు. దీంతో ఇటీవల జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలో గృహ, అపార్ట్‌మెంట్‌లు, పెద్ద పెద్ద భవనాలు, వ్యాపార సముదాయాల నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో వాటికి గానూ యూజీడీ కనెక్షన్ కోసం పలు రకాలుగా ఫీజులను నిర్ణయిస్తూ ఉత్తర్వులలో పేర్కొన్నారు. కచ్చితంగా వాటిని చెల్లిస్తేనే నీటి కుళాయైనా, యూజీడీ కనెక్షన్నైనా అందించనున్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి



సిద్దిపేట పట్టణాభివృద్ధికి కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన బిల్లుల సవరణకు ప్రజలు సహకరించాలి. మున్సిపల్‌కు ఆదాయం పెరిగితే, సమకూరిన ఆదాయంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశముంది. నివాస, వ్యాపార సంస్థల యజమానులు కచ్చితంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ పొందాలి.

-ఆశ్రిత్‌కుమార్, కమిషనర్, సిద్దిపేట మున్సిపల్

టీబీ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

నంగునూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని టీబీ అలార్ట్ ఇండియా ప్రోగ్రామ్ జిల్లా ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వెల్కటూర్, ముంద్రాయి, రాజగోపాలపేట, పాలమాకుల గ్రామాల్లోని టీబి చాంపియన్స్‌తో కలిసి మాట్లాడారు. క్షయ నివారణకు అన్ని రకాల మందులు లభిస్తున్నాయని వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించినట్లయితే వెంటనే నయం చేయవచ్చు అని గుర్తు చేశారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే ప్రతి ఒక్కరూ తమడ పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలన్నారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించినట్లయితే వెంటనే నివారించవచ్చున్నారు. టీబి వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమ ఆత్మాభిమానంతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ మందులు ఉచితంగా లభిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకొనెల చూడాలన్నారు.

మద్దూరు ఎంపీవోగా వెంకటేశ్

మద్దూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల ఎంపీవోగా గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా కార్యాలయ రికార్డులలో సంతకాలు చేసి విధులలోకి చేరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ

గజ్వేల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతను పాటిద్దాం... దోమలను అరికడదామని శ్రీగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ బల్బీర్‌సింగ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని కోటమైసమ్మ వద్ద గల బస్తీ దవాఖానా వద్ద జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బల్బీర్‌సింగ్ మాట్లాడుతూ, మన ఇంటి పరిసరాలను, మురికి నీరు గుంటలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పరిశుభ్రతను పాటిద్దాం

జగదేవ్‌పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మనం నివసించే ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో దోమలు వ్యాప్తి చెందకుండా డెంగ్యూ నివారణకు సాధ్యపడుతుందని జగదేవ్‌పూర్ మండల వైద్యాధికారి డాక్టర్ సత్యప్రకాష్ సూచించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జగదేవ్‌పూర్‌లో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యప్రకాష్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వృధాగా ఎక్కడ కూడా నీటి నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు. డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు పరిశుభ్రతే పరమావధిగా భావించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- టీచర్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) ప్రతి ఉపాధ్యాయుడు తన సమస్యల పట్ల పోరాటం చేస్తూనే బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించాలనేటువంటి తపన, విద్యార్థుల నిరంతర అభివృద్ధికై వారు చేసే కృషి అభినందనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య అన్నారు. విద్యాభివృద్ధి తో పాటు సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు బహుముఖ పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సిద్దిపేట జిల్లాలో వివిధ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను డీఈవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి సందర్శించారు. విద్యాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు తనవంతు పాత్రను పోషించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నాణ్యమైన విద్య అందివాలని, పిల్లల నమోదు పెంచాలని ప్రయత్నం చేస్తుందని, దానికి ప్రతి ఉపాధ్యాయుడు తన వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే బదిలీలు పదోన్నతులకు సంబంధించిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.

పాకిస్థానీలు, రోహింగ్యాలను గుర్తించాలి

- బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్

గజ్వేల్, మే 16 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీలు, రోహింగ్యాలను గుర్తించి, వారివారి దేశాలకు తరలించే చర్యలు చేపట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. గజ్వేల్ తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు భార్గవ్‌సాగర్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని పాకిస్థానీలు, రోహింగ్యాలను దేశం విడిచి వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశించిందన్నారు. సదరు ఉత్తర్వులను పాటించి గజ్వేల్ పట్టణంతో పాటు మండలంలో నివసిస్తున్న పాకిస్థానీలు, రోహింగ్యాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌పామ్‌లో నీడనిచ్చే మొక్కల సాగు



ఆయిల్‌పామ్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వసంతరావు

జగదేవ్‌పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్‌ను సాగుచేసిన రైతులు అంతర పంటలుగా కూరగాయలు బొప్పాయి, అరటి, పూలమొక్కలు వంటి నీడనిచ్చే మొక్కలను పెంచి అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఆయిల్ ఫెడ్ ఏరియా ఆఫీసర్ శంకర్ అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండలంలోని దౌలాపూర్‌లో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రైతులు ఉపేందర్‌రెడ్డి, నరసమ్మ సాగుచేసిన ఆయిల్‌పామ్ తోటను పరిశీలించి మెరుగైన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ, మండలంలో వివిధ గ్రామాలలో రైతులు 582 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేసినట్లు పేర్కొన్నారు.

అవసరం మేరకు రసాయన ఎరువుల వినియోగం

చిన్నకోడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులను అవసరం మేర వినియోగించాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రమాదేవి సూచించారు. శుక్రవారం చిన్నకోడూరు రైతు వేదికలో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎరువుల వాడకం, నేల సంరక్షణ, పచ్చిరొట్ట ఎరువుల వాడకం గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు విత్తనాలు కొనేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ పంటల్లో సాగునీటి ఆదా, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సిద్దిపేట ఏడీఏ పద్మ మాట్లాడుతూ రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. పంట వ్యర్థాలు కాల్చి వేయడం వల్ల కలిగే నష్టాలు, పీఎస్‌బీ వాడకం, పచ్చిరొట్ట పంటల ఆవశ్యకతను గూర్చి తెలిపారు.

అవినీతికి ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇళ్లు

మద్దూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): అవినీతికి ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు పాటుపడుతూ పేదోడి సొంతిటి కల నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామస్థులను శుక్రవారం కలిసి బాగోగులు అడిగితెలుసుకున్నారు. ఎవరి ప్రలోభాలకు లొంగకుండా గ్రామస్థులంతా ఐక్యమత్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలనర్సయ్య, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రాటిట్యూడ్ వాల్



సిద్దిపేట కోమటి చెరువు నెక్లెస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన గ్రాటిట్యూడ్ వాల్

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశానికి సైనికులు చేస్తున్న త్యాగాలు, సేవలకు గుర్తుగా సిద్దిపేట మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోమటి చెరువు నెక్లెస్ రోడ్డు వద్ద శుక్రవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఇటీవల పాకిస్తాన్ భారతదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల్లో మన దేశ సైనికులు చేసిన వీరోచిత పోరాటానికి మద్దతుగా వందేసేన పేరిట గ్రాటిట్యూడ్ వాల్ ఏర్పాటు చేశారు. ఉదయపు నడకకు వచ్చేవారు దేశం, సైనికులపై ఉన్న తమ అభిమానాన్ని సందేశంగా రాసి గోడపై ఏర్పాటు చేసిన వస్త్రం పై అతికించారు. సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడారు.

చెక్‌పోస్ట్ వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- చేర్యాల సీఐ ఎల్ శ్రీను



చెక్‌పోస్ట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ ఎల్.శ్రీను

చేర్యాల, మే 16(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం గుర్జకుంట శివారు వేచరేణి క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టను శుక్రవారం సీఐ ఎల్.శ్రీను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రింబవళ్లు విధుల నిర్వహణ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. పశువుల అక్రమ రవాణా జరగకుండా చూడాలని, పశువైద్యుడు జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తదితర డాక్యుమెంట్స్ పరిశీలించాలని, లేనియెడల ఉన్నతాధికారులకు సమాచారంఅందించాలని తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్

చేర్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ అన్నారు. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామమహాసభలో ఆయన మాట్లాడారు. చేర్యాల ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేర్యాలను విచ్ఛిన్నం చేసి ప్రజల ఉసురుపోసుకుందన్నారు. ప్రజాపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం గ్రామకమిటీ కార్యదర్శిగా పొన్నబోయిన శ్రీనివాస్, కార్యదర్శులుగా చిగుళ్ల నరేశ్, బింగి లింగం, కోశాధికారిగా చిగుల్ల నాగరాజు, సోషల్ మీడియా అధ్యక్షుడుగా పిల్లికండ్ల నర్సింహులు, తదితరులు ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి బాల్యమిత్రుల చేయూత



బాల్యమిత్రుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

రాయపోల్ , మే 16 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లో ఇటీవల మహమ్మద్ షాదుల్లా అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న 2009-2010 బ్యాచ్ షాదుల్లా పదో తరగతి స్నేహితులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 20వేలు సహాయం చేశారు. చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.